సాక్షి
అనకాపల్లి
మంగళవారం ၊ 14 ၊ అక్టోబర్ ၊ 2025



మాడుగులలో బెల్టు షాపులు తొలగించాలని మహిళలతో ర్యాలీలో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోన్‌-1 వర్కింగ్ ప్రెసిడెంట్ అనురాధ తదితరులు

ఖాకీ కాంట్రాక్టర్



- ఏకంగా 25 వాహనాలు... బినామీ పేర్లతో నిర్వహణ
- అందుకే అదే పనిగా ఆందోళనల అడ్డగింత
- కాకినాడ నుంచి అక్రమ మైనింగ్‌కు రూట్ క్లియర్
- గతంలో చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారుల యత్నం
- రంగంలోకి దిగి నిలిపేసిన హోంమంత్రి?

బల్క్ డ్రగ్ పార్కు వల్ల తమ జీవితాలు నాశనమవుతాయని ఒకవైపు మత్స్యకారులు తీవ్ర ఆందోళనతో పోరాటాలు చేస్తుంటే.. కనీసం సీరియస్‌గా పట్టించుకోకుండా ఖాకీలు కాసుల వేటలో పడినట్లు తెలుస్తోంది. బినామీ పేర్లతో కాంట్రాక్టర్లుగా మారి వాహనాలు పెట్టి పనిచేయిస్తున్నట్టు సమాచారం. ఓ పోలీసు అధికారి బల్క్ డ్రగ్ పార్క్ పనులకు బినామీ పేర్లతో సుమారు 25 వాహనాలను నడుపుతున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వ్యక్తిగత ప్రయోజనాల కోసమే బల్క్ డ్రగ్ పార్క్ నిరసనల అణచివేతను సదరు అధికారి సీరియస్‌గా తీసుకొని వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఆందోళనలను అదుపు చేయడంలో ప్రభుత్వ పెద్దల నుంచి అదేపనిగా వస్తున్న ఒత్తిళ్లతోపాటు ఆ ఖాకీ కాంట్రాక్టర్ వ్యక్తిగత ప్రయోజనాలు కూడా ఇమిడి ఉన్నాయన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. బల్క్ డ్రగ్ పార్కు పనుల్లో కాంట్రాక్టర్ అవతారం ఎత్తడమే కాక.. పక్క జిల్లా కాకినాడ నుంచి మైనింగ్ ట్రక్కులు అక్రమంగా అనకాపల్లి జిల్లాలోకి రయ్ రయ్‌మంటూ రావడానికి కూడా సదరు అధికారి రూట్‌ను పక్కాగా క్లియర్ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో సదరు పోలీసు అధికారిపై వేటు వేసేందుకు ఉన్నతాధికారులు ప్రయత్నించినట్టు తెలుస్తోంది. అయితే, హోంమంత్రి రంగంలోకి దిగడంతో చర్యలు కాస్తా నిలిపివేసినట్టు ప్రచారం జరుగుతోంది. హోంమంత్రి ఎక్కడకు వెళ్లినా... ఉన్నతాధికారులకు సమాచారం లేకుండా ఆయన కూడా అక్కడకు వెళుతున్నారనే ఆరోపణలున్నాయి.

అక్రమాలకు అండ...!

పాయకరావుపేట నియోజకవర్గం ఎంతో కీలకమైనది. అనకాపల్లి జిల్లాకు శివారు నియోజకవర్గం. ఇక పక్కనే యలమంచిలి నియోజకవర్గంలోని రాంబిల్లి వద్ద నావికాదళ పనులు జరుగుతున్నాయి. ఇక్కడకు ఇప్పటికే అనకాపల్లి జిల్లాలోని రూరల్ మండలాల నుంచి భారీగా అక్రమంగా బండరాళ్లు వచ్చిపడుతున్నాయి. అంతేకాకుండా జిల్లా పక్కనున్న కాకినాడ జిల్లాలోని రౌతులపూడి నుంచి కూడా అక్రమంగా భారీ సంఖ్యలో రాంబిల్లి వద్దకు టిప్పర్లు చేరుకోవడంతో సదరు పోలీసు అధికారి ప్రమేయం ఉన్నట్టు విమర్శలున్నాయి. కొద్దిరోజుల క్రితం రెండు భారీ బండరాళ్లు నావికాదళ పనుల కోసం తీసుకెళుతుండగా రోడ్డు మీదనే పడిపోయాయి. టిప్పర్ వెనుక ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ టిప్పర్ ఎటువంటి అనుమతులు లేకుండానే నిబంధనలకు మించి అధిక లోడుతో ఏకంగా కాకినాడ జిల్లా నుంచి వచ్చింది. ఈ వాహనం పాయకరావుపేటలోని పోలీసుల అనధికార అనుమతితోనే దర్జాగా జిల్లాలోకి ప్రవేశించిందనే విమర్శలున్నాయి. ఈ వ్యవహారంలో ప్రతి నెలా సదరు అక్రమ మైనింగ్ మాఫియా నుంచి భారీగా దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.



రాంబిల్లి మండలం కొండవారిపాలెం గ్రామం వద్ద టిప్పరు నుంచి జారి పడ్డ భారీ బండరాళ్లు (ఫైల్)

మంత్రి అండదండలతో.....!

సదరు పోలీసు అధికారి హోంమంత్రి సొంత నియోజకవర్గంలో ఆమె అండదండలతోనే పోస్టింగు దక్కించుకున్నారు. దీంతో అటు ఎస్పీని, ఇటు డీఐజీని కూడా లెక్క చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అంతే కాకుండా నియోజకవర్గంలో ఎవరికి పోస్టింగు దక్కాలన్నా... తన అనుమతితోనే జరుగుతుందని కూడా చెప్పుకునేవారు. సదరు పోలీసు అధికారిపై ఇప్పటికే పలు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఒకవైపు బినామీలతో కాంట్రాక్టర్ అవతారం ఎత్తడంతోపాటు అక్రమ మైనింగ్ వాహనాలకు రూట్ క్లియర్ చేయడంలో ఈయనదే కీలకపాత్ర అన్న విమర్శలున్నాయి. ఈ వ్యవహారాలన్నీ కొన్ని నెలల క్రితం జిల్లా పోలీస్ బాస్‌తోపాటు డీఐజీ దృష్టికి కూడా వెళ్లినట్టు తెలుస్తోంది. అప్పట్లోనే చర్యలు తీసుకునేందుకు ఉపక్రమించినప్పటికీ హోంమంత్రి రంగంలోకి దిగి వేటు పడకుండా కాపాడారన్న ప్రచారం ఉంది. దీంతో మరింతగా రెచ్చిపోయి... నియోజకవర్గంలో పోలీసుశాఖ పరంగా ఏది జరగాలన్నా తన అనుమతి ఉండాల్సిందేనంటూ బహిరంగంగా వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం. సదరు పోలీసు అధికారికి మరో జూనియర్ పోలీస్ కూడా తోడై.... హోంమంత్రి ఎక్కడకు వెళ్లినా వెళుతున్నట్టు తెలుస్తోంది. హోంమంత్రితోపాటుగా దేవస్థానాల్లో దండలు వేయించుకుని మరీ ఫొటోలకు పోజులు ఇచ్చినట్టు కూడా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్టు ఆ శాఖలోనే ప్రచారం జరుగుతోంది.

సారాసురులపై రణభేరి



యలమంచిలి ఎక్సైజ్ సీఐ జ్ఞానేశ్వరికి వినతిపత్రం ఇస్తున్న కరణం ధర్మశ్రీ, బొడ్డేడ ప్రసాద్, తదితరులు

- కూటమి నేతల కల్తీ దందాపై కదం తొక్కిన వైఎస్సార్ సీపీ మహిళా విభాగం
- కల్తీ మద్యంతో ప్రాణాలు పోతున్నాయని ఆగ్రహం
- అన్ని నియోజకవర్గంలో నిరసనలు, ధర్నాలు
- ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాలు అందజేత

రాష్ట్రంలో కల్తీ మద్యం తయారీ, విక్రయాలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు సోమవారం కదం తొక్కాయి. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో భారీ ర్యాలీలు, ఎక్సైజ్ స్టేషన్ల ముట్టడి, ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



పాయకరావుపేటలో నిరసన ర్యాలీ చేపడుతున్న కంబాల జోగులు, బొడ్డేడ ప్రసాద్, చిక్కాల, వీసం, నాయకులు



చోడవరం ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు,

సాక్షి, అనకాపల్లి: కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యంపై మహిళలు కదం తొక్కారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతృత్వంలో పోరుబాట పట్టారు. కల్తీ మద్యం తయారీ కేంద్రాలు కుటీర పరిశ్రమల్లా నడుస్తున్నాయని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని ధ్వజమెత్తారు. ఆందోళనలు చేపట్టారు. వర్షం పడుతున్నా.. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా మహిళలు పాల్గొన్నారు. నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీలు చేపట్టారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఎక్సైజ్ అధికారులకు అందజేశారు.

- పాయకరావుపేటలో సమన్వయకర్త కంబాల జోగులు ఆధ్వర్యంలో సోమవారం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం జరిగింది. ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావుకు నారా వారి నకిలీ మద్యం అరికట్టాలని వినతి పత్రం అందించారు. పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు వీసం రామకృష్ణ, చిక్కాల రామారావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.
- నర్సీపట్నంలో ఆ నియోజకవర్గం సమన్వయకర్త పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. నల్లబాడ్జీలు ధరించి ఎక్సైజ్ సీఐ సునీల్‌కుమార్‌కు కల్తీ మద్యం అరికట్టాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడి శిష్యుడు, మాకవరపాలెం మండలానికి చెందిన టీడీపీ నాయకుడు రుత్తల రాము పరవాడ ప్రాంతంలో కోట్ల రూపాయల విలువ చేసే నకిలీ మద్యంతో ఇటీవల పట్టుబడ్డారన్నారు. నర్సీపట్నంలో ఉన్న మద్యం దుకాణాలు స్పీకర్ అనుచరులేవేనన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత, పట్టణ మహిళా అధ్యక్షురాలు కణితి అన్నపూర్ణ, పాల్గొన్నారు.

కటకటాలపాలు చేయాలి

చోడవరంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆ నియోజకవర్గ సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. ర్యాలీ నిర్వహించిన అనంతరం చోడవరం ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆ పార్టీ శ్రేణులు, మహిళలు ముట్టడించారు. అమర్‌నాథ్ మాట్లాడుతూ.. కల్తీ మద్యం తయారీదారులందర్నీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సీబీఐ విచారణకు ఆదేశించాలన్నారు పార్టీ రాష్ట్ర కార్యదర్శులు దంతులూరి దిలీప్‌కుమార్, ఏడువాక సత్యారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దొండ రాంబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గు శ్యామల, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



నర్సీపట్నంలో వర్షంలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, పార్టీ నేతలు

- యలమంచిలిలో సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ పాల్గొన్నారు. ఎక్సైజ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి కల్తీ మద్యం అరికట్టాలని నినాదాలు చేశారు. ఇన్‌చార్జ్ ఎక్సైజ్ సీఐ ఎం.జ్ఞానేశ్వరికి రాష్ట్రంలో మద్యం విధానాన్ని వ్యతిరేకిస్తూ పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఎస్‌ఈసీ సభ్యుడు బొదెపు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.
- అనకాపల్లిలో నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిపారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో సీఐ వై.లక్ష్మణనాయుడుకు పార్టీ నియోజకవర్గ మహిళా విభాగం నేతలు వినతి పత్రం అందజేశారు. పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, పార్టీ పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి బార్లా మద్యం దుకాణాలు

మాడుగులలో ఆ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం జోన్ వన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ పాల్గొన్నారు. ప్లకార్డులతో మహిళలు, వైఎస్సార్ సీపీ నాయకులు నిరసన తెలియజేశారు. అనంతరం ఎక్సైజ్ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చాక బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయని, అర్ధరాత్రి కూడా తెరిచి ఉంటున్నాయని విమర్శించారు. మద్యం మత్తులో హత్యలు, అత్యాచారాలు బాగా పెరిగిపోయాయన్నారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న సమన్వయకర్త భరత్‌కుమార్ తదితర పార్టీ నాయకులు


న్యూస్‌రీల్

ఉపాధి హామీ కూలీలకు ఈ-కేవైసీ

నవంబరు నుంచి బయోమెట్రిక్: కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ఉపాధి హామీ వేతనదారులకు నవంబరు నెల నుంచి ముఖ అధారిత హాజరు తప్పనిసరిగా ఉండాలని, అందుకు తగ్గట్లుగా వేతనదారులకు అవసరమైన ఈ-కేవైసీ వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి మండలానికి ఒక మేజిక్ డ్రెయిన్ పూర్తి చేయాలని, లక్ష్యం మేరకు ఉపాధి హామీ పథకం కూలీలను సమీకరించాలని, వారికి కనీస వేతనం అందేలా పనులు కల్పించాలన్నారు. మండలాలకు మంజూరు చేసిన నీటి కుంటలు, పశువుల షెడ్ల పనులు మొదలు పెట్టి పూర్తిచేయాలన్నారు. పాయకరావుపేట మండలం నామవరం గ్రామం లే అవుట్‌లో గృహప్రవేశాలు నిర్వహిస్తామని, లే అవుట్‌లో మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గృహనిర్మాణశాఖ పీడీ శ్రీనివాస్, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, డీపీవో సందీప్ ఇతర అధికారులు, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

సఫారీ..జైత్రయాత్ర



విశాఖ స్పోర్ట్స్: వైఎస్సార్ స్టేడియంలో సోమవారం జరిగిన ఐసీసీ వుమెన్ క్రికెట్ వరల్డ్‌కప్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా మూడు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై విజయం సాధించి సెమీస్‌కు అర్హత సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్, షర్మిన్ (50), షోర్నా (51) అర్ధ సెంచరీల సహాయంతో 6 వికెట్లకు 232 పరుగులు చేసింది. 233 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన దక్షిణాఫ్రికా జట్టుకు మారిజన్నే కాప్ (56), క్లో ట్రియాన్ (62) కీలక అర్ధ సెంచరీలతో రాణించడంతో మరో మూడు బంతులుండగానే విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో దక్షిణాఫ్రికా వరుసగా మూడు విజయాలు సాధించి, ఆరు పాయింట్లతో సెమీస్ బెర్త్‌ను దాదాపుగా ఖాయం చేసుకుంది.

సీఐ కుమారస్వామిపై బదిలీ వేటు



నక్కపల్లి: స్థానిక సీఐ కుమారస్వామిపై బదిలీ వేటు పడింది. సోమవారం ఆయన బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఆయనను వీఆర్‌కు పంపిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. బల్క్ డ్రగ్‌పార్క్‌కు వ్యతిరేకంగా రాజయ్యపేట మత్స్యకారులు ఆదివారం జాతీయ రహదారిని ముట్టడించి నాలుగు గంటలపాటు రాకపోకలు స్తంభింపజేశారు. కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పే వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని మత్స్యకారులు భీష్మించారు. ఎట్టకేలకు కలెక్టర్, ఎస్పీ వచ్చి మత్స్యకారులను శాంతింపజేయాల్సివచ్చింది. దీనికితోడు 15 రోజుల క్రితం మత్స్యకారుల డిమాండ్ మేరకు హోంమంత్రి వంగలపూడి అనిత రాజయ్యపేట వెళ్లారు. ఈ సందర్భంలో ఆమె తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవలసి వచ్చింది. మంత్రి వాహనాలకు అడ్డంగా కొబ్బరి, తాటి చెట్లు పడేసి కాన్వాయ్ కదలకుండా మత్స్యకారులు అడ్డుకున్నారు. హోంమంత్రిని ఈ స్థాయిలో మత్స్యకారులు అడ్డుకుంటారన్న విషయాన్ని ముందుగానే స్థానిక పోలీసులు పసిగట్టకపోవడాన్ని కూడా ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించారు. అప్పట్లోనే స్థానిక సీఐ వైఫల్యం ఉందని, ఆయనపై బదిలీ వేటు తప్పదన్న ప్రచారం జరిగింది. ఆదివారం వేలాది మంది మత్స్యకారులు జాతీయ రహదారిని దిగ్బంధం చేయడం కూడా సీఐకు ప్రతికూలంగా మారింది. నిజానికి విశాఖ నగర పోలీసుల చర్యలే ఈ ఆందోళన తీవ్రతకు కారణమన్న ప్రచారం జరుగుతోంది. మత్స్యకారులకు మద్దతుగా కోర్టు అనుమతితో రాజయ్యపేట వస్తున్న బీసీవై పార్టీ అధినేత బి.రామచంద్రయాదవ్‌ను విశాఖలో పోలీసులు అడ్డుకున్నారు. గతంలో రాజమండ్రిలో కూడా ఇలాగే జరిగింది. ఆదివారం విశాఖలో అడ్డుకున్నారన్న విషయం తెలుసుకున్న మత్స్యకారులంతా అడ్డగింతలు, గృహ నిర్బంధాలపై తాడోపేడో తేల్చుకునేందుకు జాతీయ రహదారిని ముట్టడించారు. ఏది ఏమైనప్పటికీ కర్ణుడి చావుకు వేయి కారణాలన్నట్టు కుమారస్వామి బదిలీకి పలు అంశాలు దోహదపడ్డాయి. నక్కపల్లి కొత్త సీఐగా షేక్ గఫూర్‌ను నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆయన ప్రస్తుతం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్నారు.

గెడ్డ, పోరంబోకు భూమి స్వాధీనం

- ఆక్రమిత స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్
- భూమిలో నాటిన మొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



మొక్కలు నాటించిన ఆర్.వై.పాత్రుడు సోదరుడిని హెచ్చరిస్తున్న తహసీల్దార్ వెంకటరమణ

మాకవరపాలెం: ఆక్రమణలో ఉన్న గెడ్డ, పోరంబోకు భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని తామరం రెవెన్యూలోగల 61/3లోని సుమారు 20 ఎకరాల గెడ్డ, పోరంబోకు భూమి ఆక్రమణపై సోమవారం సాక్షి పత్రికలో 'పచ్చనేత.. భూముల మేత' శీర్షికన ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ వెంకటరమణ స్పందించారు. సిబ్బందితో కలిసి గెడ్డ, పోరంబోకు భూమిని పరిశీలించారు. ఇప్పటికే ఈ భూమిలో నాటిన మొక్కలను పూర్తిగా తొలగించారు. ఈ మొక్కలను దగ్గరుండి నాటించిన టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడి సోదరుడు రుత్తల రమణమూర్తిని తహసీల్దార్ హెచ్చరించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు గెడ్డ, పోరంబోకు భూములను ఆక్రమించడం నేరమన్నారు. ఇకపై ఈ భూమిలో మొక్కలు నాటడం, కట్టడాలు నిర్మించడం చేస్తే క్రిమినల్ కేసులు పెడతామని స్పష్టం చేశారు. ఈ భూమిలో హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ చక్రపాణి, సిబ్బంది ఉన్నారు.

20 కాదు.. 8 ఎకరాలే..

తామరం గెడ్డ, పోరంబోకు భూమిలో మొక్కలు నాటడంలో తన ప్రమేయం లేదని రాచపల్లి ఎంపీటీసీ, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు సాక్షికి తెలిపారు. 61/3 సర్వే నంబర్‌లో ఉన్న 21.63 ఎకరాల్లో తనకు 8 ఎకరాలు వారసత్వంగా వచ్చిందన్నారు. 2013లో రెవెన్యూ అధికారులు తనపై పెట్టిన కేసులు కోర్టులో ఉన్నట్టు చెప్పారు.

30వ రోజుకు చేరిన రాజయ్యపేట దీక్షలు



మత్స్యకారులనుద్దేశించి మాట్లాడుతున్న వీసం రామకృష్ణ

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేయాలని కోరుతూ రాజయ్యపేట మత్స్యకారులు చేపట్టిన నిరాహారదీక్ష సోమవారం 30వ రోజుకు చేరుకుంది. ఆదివారం జాతీయరహదారిని దిగ్బంధించి నాలుగు గంటలపాటు వాహనాల రాకపోకలను అడ్డుకున్న మత్స్యకారులు.. బుధవారం సమావేశం నిర్వహిస్తామన్న కలెక్టర్ హామీతో శాంతించిన విషయం తెలిసిందే. వారు సోమవారం నూకతాత ఆలయం వద్ద రిలే దీక్ష కొనసాగించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, సిటు జిల్లా కార్యదర్శి ఎం.రాజేష్ తదితరులు దీక్షకు సంఘీభావం ప్రకటించారు. వీసం రామకృష్ణ మాట్లాడుతూ పోలీసులు అతిగా ప్రవర్తించి ఆంక్షలు విధించడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఉద్యమం ఉధృతమయిందన్నారు. ప్రారంభంలోనే ప్రభుత్వం మత్స్యకారులతో చర్చలు జరిపి ఉంటే బాగుండేదన్నారు. 30 రోజులుగా దీక్ష చేస్తున్న మత్స్యకారులు ఇప్పటి వరకు ఎటువంటి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయలేదని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించలేదన్నారు. అయినప్పటికీ పోలీసుల కవ్వింపు చర్యలతో కడుపు మండిన మత్స్యకారులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి కలిగిందన్నారు. ఈ ధర్నాలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, మత్స్యకార నాయకులు ఎరిపల్లి నాగేశు, మహేష్, సోమేష్, నారాయణరావు, బైరాగి రాజు, పిక్కితాతీలు, మైలపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దోమల లార్వా నివారణకు గంబూషియా చేపలు



కలెక్టరేట్‌లోని నీటి కొలనుల్లో గంబూషియా చేపలు వదులుతున్న డీఆర్వో సత్యనారాయణ

తుమ్మపాల: దోమల లార్వాను తినే గంబూషియా చేపలతో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని నీటి కొలనుల్లో ఆయన గంబూషియా చేపలను వదిలారు. జిల్లాలో ఎంపిక చేసిన 295 నీటి నిల్వ కేంద్రాలు, చెరువులు, కొలనులు, బావులలో లక్షా 30 వేల గంబూషియా చేపలను విడుదల చేశామన్నారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నిర్మూలనలో యాంటీ లార్వా ఆపరేషన్ కీలకమని, గంబూషియా చేపలు ఈ ప్రక్రియలో ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. ఇవి నీటిలో మూడు నుంచి నాలుగు సంవత్సరాల వరకు జీవించి, దోమల లార్వాలను పూర్తిగా తినేస్తాయన్నారు. ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాయంత్రం వేళల్లో వేపాకు పొగ వేయడం, దోమతెరలు వాడడం వంటి చర్యలు దోమకాటుకు నిరోధంగా ఉపయోగపడతాయన్నారు. జ్వరం వచ్చిన వెంటనే సమీప పీహెచ్‌సీని సందర్శించాలన్నారు. డీపీవో సందీప్, సీపీవో రామారావు, జిల్లా మలేరియా అధికారి వరహాల దొర తదితరులు పాల్గొన్నారు.

కె.జె.పురం తాచేరు వంతెన వద్ద కూలిన కల్వర్టు

భారీ వాహనాలు తిరగడమే కారణం



కె.జె.పురం తాచేరు వంతెన వద్ద కూలిన కల్వర్టు

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం తాచేరు వంతెన పక్కన గల కల్వర్టు సోమవారం సాయంత్రం కూలిపోయింది. దీంతో గ్రామంలోకి రాకపోకలు స్తంభించిపోయాయి. ఈ కల్వర్టు మీదుగా 50 రోజుల పాటు బస్సులు, ఇతర పెద్ద వాహనాలు తిరగడమే కల్వర్టు కూలిపోవడానికి కారణమని స్థానిక ప్రజలు వాపోతున్నారు. విజయరామరాజుపేట బొడ్డేరు నది మీద కాజ్‌వే ఆగస్టు మాసంలో కొట్టుకొని పోవడంతో పాడేరు, మాడుగుల నుంచి చోడవరం, విశాఖ, అనకాపల్లి వెళ్లే బస్సులను కె.జె.పురం గ్రామం మీదుగా నడిపారు. ఈ కల్వర్టు బలహీనంగా ఉందని, ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితుల్లో ఉందని సాక్షిలో వార్తలు కూడా ప్రచురితమయ్యాయి. భారీ వాహనాలు నడిపేటప్పుడు కల్వర్టుకు చిన్న రంధ్రం ఏర్పడటంతో తాత్కాలికంగా స్థానికులు మట్టితో కప్పారు. అయితే సోమవారం సాయంత్రం కల్వర్టు కూలిపోవడంతో ఈ రహదారి గుండా ఆటోలు, ఇతర పెద్ద వాహనాలు తిరిగే అవకాశం లేదని, ఈ దృష్ట్యా చోడవరం, నుంచి గ్రామానికి వచ్చే వాహనాలను వంటర్లపాలెం గ్రామం మీదుగా నడపాలని స్థానికులు వాహనదార్లకు విజ్ఞప్తి చేశారు. కల్వర్టు కూలిపోవడంతో చోడవరం, మాడుగుల, తదితర ప్రాంతాల నుంచి ఆటోలు ఇతర వాహనాలు నిలిచిపోయాయి. వీరు వంటర్లపాలెం మీదుగా వచ్చారు. ఆర్ అండ్ బి అధికారులు యుద్ధప్రాతిపదిక మీద కల్వర్టు పనులు పూర్తి చెయ్యాలని స్థానికులు కోరుతున్నారు.

చోడవరంలో సొంత ఇల్లు నిర్మాణానికి అమర్ శ్రీకారం


చోడవరంలో సొంత ఇంటి నిర్మాణ పనులకు శ్రీకారంచుట్టిన గుడివాడ అమర్‌నాథ్

చోడవరం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, చోడవరం నియోజకవర్గ సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్ చోడవరంలో తన సొంత ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పట్టణ పరిధిలో భూమిని కొనుగోలు చేసి ఇంటి నిర్మాణానికి స్థలాన్ని సోమవారం శుభ్రం చేయించారు. అమర్‌నాథ్‌ను పూర్తిస్థాయిలో చోడవరం నియోజకవర్గం సమన్వయకర్తగా వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నియమించడం, ఆయన కొంత కాలంగా నియోజకవర్గంలో ప్రజల తరపున ప్రజాసమస్యలపై అనేక ఆందోళన చేయడం, పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం చేస్తున్నారు. ఇక నుంచి పూర్తి స్థాయిలో చోడవరంలోనే ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సొంత ఇంటితో పాటు ఇక్కడ పార్టీ కార్యాలయం కూడా ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్నారు. దీంతో ఆయన పూర్తి స్థాయిలో తమకు అందుబాటులో ఉంటారని పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ సొంత ఇల్లు నిర్మించుకొని ప్రజలకు, కార్యకర్తలకు మరింత చేరువగా ఉండి సేవచేయాలన్న సంకల్పంతో ఉన్నానని ఈ సందర్భంగా అమర్‌నాథ్ తెలిపారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై రణభేరి

- గ్రామీణ స్థాయి నుంచి కోటి సంతకాల సేకరణ
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం

అనకాపల్లి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం నవంబర్ 22వ తేదీ వరకూ గ్రామీణ స్థాయి నుంచి నిర్వహించడం జరుగుతుందని, కోటి సంతకాల అనంతరం గవర్నర్‌కు పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేయడం జరుగుతుందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో కోటి సంతకాల పోస్టర్‌ను సోమవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలంలో నిర్మాణదశలో ఉన్న మెడికల్ కళాశాల పరిశీలనకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అనకాపల్లి జాతీయ రహదారి మీదుగా కొత్తూరు, కశింకోట, తాళ్లపాలెం, బయ్యవరం మీదుగా మెడికల్ కళాశాలకు వెళ్లే సమయంలో ప్రజలు పెద్ద ఎత్తున బ్రహ్మరథం పట్టడం జరిగిందని స్వయంగా జగన్ మోహన్‌రెడ్డి చెప్పడం ఎంతో ఆనందానికి గురిచేసిందన్నారు. ఈనెల 28న నియోజకవర్గ స్థాయిలో ప్రచారం, నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. మొదటి సంతకాన్ని మలసాల భరత్‌కుమార్, రెండో సంతకాన్ని పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ చేపట్టారు. కార్యక్రమంలో పార్లమెంట్ పరిశీలకురాలు శోభాహైమావతి, పార్టీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీ నరసింహం, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు రత్నకుమారి, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, 80వ వార్డు ఇన్‌ఛార్జ్ కెఎం.నాయుడు, మండలపార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పార్టీ నాయకులు కొణతాల మురళీకృష్ణ, కాండ్రేగుల హైమావతి, మునూరు శ్రీనివాసరావు, బొడ్డేడ శివ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి

ఉద్యమంలో భాగస్వాములు కండి

చోడవరం: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మాజీ మంత్రి, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, చోడవరం నియోజకవర్గం సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్ హెచ్చరించారు. చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ ప్రచార వాల్ పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణలో ప్రజలంతా భాగస్వాములు అవ్వాలని పిలుపు ఇచ్చారు. ప్రభుత్వ సంస్థలు, విద్యావ్యవస్థను కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అమ్మేయాలని చూస్తుందన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలన్న యోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ పోరాటంలో భాగంగానే ఈ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అమర్‌నాథ్ చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లిమళ్ల అచ్చెంనాయుడు, గాడి అప్పారావు, గూనూరు రామచంద్రనాయుడు, గూనూరు రాజు, ఓరుగంటి నెహ్రూ, అప్పికొండ లింగబాబు, పోతల ప్రసాద్, బొడ్డు శ్రీరామూర్తి, సూరిశెట్టి నాగదుర్గ గోవింద, మొల్లి సోమునాయుడు, పందిరి శ్రీనివాసరావు, చవితిన బాబూరావు, శానాపతి సత్యారావు పాల్గొన్నారు.


చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరించిన మాజీ మంత్రి అమర్‌నాథ్

మునగపాక వాసికి ప్రతిష్ఠాత్మక పురస్కారం

- శాంతారామ్‌కు ఇండియన్ పోలీసు మెడల్ బహూకరణ
- కోల్‌కతాలో ఆర్‌పీఎఫ్ డీఐజీగా సేవలు


రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ చేతుల మీదుగా ఇండియన్ పోలీసు మెడల్ అందుకుంటున్న శాంతారామ్

మునగపాక: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసే వారికి అవార్డులు వెతుక్కుంటూ వస్తాయని మునగపాకకు చెందిన శాంతారామ్ చాటి చెప్పారు. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ పోలీసు మెడల్ దక్కించుకొని ఎంతోమందికి ఆయన ఆదర్శంగా నిలిచారు. మునగపాకకు చెందిన పెంటకోట సత్యనారాయణ, సత్యవతి కుమారుడు శాంతారామ్. సత్యనారాయణ గతంలో ఎస్పీగా సేవలందించి రాష్ట్రపతి అవార్డును దక్కించుకున్నారు. సత్యనారాయణ కుమారుడు వెంకట శ్రీధర శాంతారామ్ ప్రస్తుతం కోల్‌కతాలోని ఆర్‌పీఎఫ్ విభాగంలో డీఐజీగా సేవలందిస్తున్నారు. తండ్రికి తగ్గ తనయునిగా ఎంతో సమర్థతతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శాంతారామ్ సేవలను గుర్తించిన రైల్వే ఉన్నతాధికారులు ఆయనను ఇండియన్ పోలీసు మెడల్‌కు ఎంపిక చేశారు. సోమవారం నిర్వహించిన ఆర్‌పీఎఫ్ డేలో భాగంగా కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్ చేతుల మీదుగా మెడల్‌ను అందుకున్నారు. గుజరాత్‌లోని ఆర్‌పీఎఫ్ జోనల్ ట్రైనింగ్ కేంద్రంలో శాంతారామ్ పురస్కారాన్ని అందుకున్నారు.

మాతా శిశు మరణాలు అరికట్టాలి

టాస్క్‌ఫోర్స్ జిల్లా ప్రధాన అధికారి ప్రశాంతి

అచ్యుతాపురం: మాతా, శిశు మరణాలను నివారించేందుకు వైద్య సిబ్బంది మరింత కృషి చేయాలని మెడికల్ టాస్క్ ఫోర్స్ జిల్లా ప్రధాన అధికారి జె.ప్రశాంతి అన్నారు. మండలంలో గల హరిపాలెం పీహెచ్‌సీ పరిధిలోని కొండకర్ల విలేజ్ హెల్త్ క్లినిక్‌ను టాస్క్ ఫోర్స్ బృందం సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ పిల్లలు,గర్భిణులు,బాలింతలలో రక్త హీనత లేకుండా వైద్య సలహాలు,వైద్య సహాయం అందించాలన్నారు. ప్రతీ కాన్పు కచ్చితంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామ స్థాయిలో పరిసరాల పరిశుభ్రత ఎంత కీలకమో ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. ఈమేరకు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా గణాంకాధికారి రామచంద్రరావు, ఐడీఎస్ పీకో ఆర్డినేటర్ జనార్దన్, ఎంపీహెచ్‌ఓ శ్రీనివాస్, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమా మహేశ్ పాల్గొన్నారు.


కొండకర్ల విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న టాస్క్ ఫోర్స్ బృందం

పెండింగ్ అర్జీలను పరిష్కరించండి

- డివిజన్, మండల కార్యాలయాల్లోనూ పీజీఆర్‌ఎస్
- కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాలు


వృద్ధురాలి సమస్యను వింటున్న కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల: పీజీఆర్‌ఎస్ అర్జీలపై నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో ఆమెతో పాటు జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు, ఎస్డీసీ రమామణి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి అర్జీదారులకు వివరించాలన్నారు. పరిష్కరించదగ్గ అర్జీలను తక్షణమే పూర్తి చేయాలన్నారు. డివిజను, మండల స్థాయిలో నిర్వహించే పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి, రశీదు అందించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు.

నర్సాపురం పంచాయతీలో సమస్యలపై వినతి

చోడవరం మండలం నర్సాపురం గ్రామం ప్రత్యేక పంచాయతీగా ఉన్నప్పటికీ రాయపురాజుపేట రెవెన్యూ గ్రామంగానే కొనసాగడంతో రైతులు, విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని నర్సాపురం సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ బి.లక్ష్మి, గ్రామపెద్దలు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. నర్సాపురం పంచాయతీ విభజన జరిగినా ఎటువంటి ప్రయోజనం జరగడం లేదని, నర్సాపురం గ్రామ సచివాలయం వెంకన్నపాలెంలోను, రెవెన్యూ పరిధి రాయపురాజుపేటలోను ఉండటంతో ప్రజలంతా ధ్రువీకరణ పత్రాలు విషయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో విద్యార్థులకు అందించే పత్రాల్లో రాయపురాజుపేట గ్రామంగా నమోదవుతుందని, రైతుల భూములు కూడా రెవెన్యూ పరిధి మాదిరిగానే నమోదవ్వడం, సచివాలయ పరిధి వెంకన్నపాలెం కావడంతో ప్రభుత్వ పథకాలు కూడా సక్రమంగా అందడం లేదని, యూరియా పంపిణీలో కూడా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని తెలిపారు. పూర్తిస్థాయి పంచాయతీగా నర్సాపురం గ్రామాన్ని నిర్ధారించాలని కోరారు.

గురుకుల పాఠశాలలో సౌకర్యాలు కల్పించండి..

డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో అపారిశుధ్యం కారణంగా దోమలు, పాముల బెడద నుంచి విద్యార్థులను కాపాడాలని, మరమ్మతులు చేపట్టి నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ దేవరపల్లి మండలం తెనుగుపూడి గ్రామంలో గల గురుకుల పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఇరట నరసింహమూర్తి పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. పాఠశాల నుంచి హైస్కూల్ వరకు సీసీ రోడ్డు వేయాలని, పాఠశాలలో కూడా మరమతులు చేపట్టి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు..

అక్రమ మద్యం అమ్మకాలను నిరోధించాలని డిమాండ్ చేస్తూ వి.మాడుగుల మండలంలోని పలువురు సీపీఎం నాయకులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో చిల్లర దుకాణాల నుంచి దాబాల వరకు అన్నింటా మద్యం విచ్చలవిడిగా అమ్ముతున్నారని, బాటిల్ ఎంఆర్‌పీ ధర కన్నా అదనంగా రూ.50 అదనంగా వసూలు చేస్తు ప్రజల కష్టాన్ని దోచుకుంటున్నారని తెలిపారు. కల్తీ మద్యంపై ఎటువంటి నిఘా లేదన్నారు. మద్యానికి యువత యవత బానిసలుగా మారడంతో ఘర్షణలు, హింస పెరిగిందన్నారు.

చీఫ్ జస్టిస్‌పై దాడి గర్హనీయం

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్.గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు అరెస్టు చేయాలంటూ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సభ్యులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. దాడి వెనుక శక్తులను గుర్తించి శిక్షలు పడేవిధంగా స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా కమిటీ అనకాపల్లి ఇన్‌చార్జి పి.వెంకటరమణ డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు.


అర్జీదారుల సమస్యలను వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

ప్రభుత్వ పథకాలు అందడం లేదు..

సాగు భూములకు పట్టాలు ఉన్నప్పటికి రెవెన్యూ వెబ్‌ల్యాండ్‌లో రైతుల పేర్లతో ఆన్‌లైన్ చేయకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు పొందలేక పంటల సాగుకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వి.మాడుగుల మండలం ఒమ్మలి గ్రామానికి చెందిన కార్లె భవానీ రైతుల తరపున పీజీఆర్‌ఎస్‌లో అర్జీ దాఖలు చేశారు. వి.మాడుగుల, ఒమ్మలి, జగన్నాథపురం, కృష్ణాపురం, రావికమతం మండలంలో పలు గ్రామాల్లో ఊరలోవ, నాగళ్లకొండ, కొప్పుకొండమ్మ, అడ్డుకొండ ప్రాంతాల్లో 450 మంది రైతులను గుర్తించినప్పటికి ఎటువంటి ప్రక్రియ మొదలుపెట్టలేదని, వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్పీ కార్యాలయానికి 55 ఫిర్యాదులు

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయానికి సోమవారం పీజీఆర్‌ఎస్‌కు 55 అర్జీలు వచ్చాయి. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు వారివారి సమస్యలను లిఖితపూర్వకంగా ఎస్పీ తుహిన్ సిన్హాకు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. భూ తగాదాలు-28, కుటుంబ కలహాలు-6, ఇతర విభాగాలకు చెందినవి-21 అర్జీలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఎస్‌ఐ శిరీష పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో జరిమానా

పరవాడ: విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి కేసులో పరవాడ మండలం రావాడకు చెందిన షేక్ చిన్నారావుకు రూ.3 వేలు జరిమానా విధిస్తూ అనకాపల్లి 11వ అదనపు కోర్టు న్యాయమూర్తి ఎ.రమేష్ సోమవారం తీర్పు ఇచ్చినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. ఈ కేసులో ముద్దాయి జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో వెల్లడించారని పేర్కొన్నారు. పరవాడ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్ పి.అచ్చింనాయుడుపై 2019లో రావాడ గ్రామానికి చెందిన షేక్ చిన్నారావు దాడి చేసి, విధి నిర్వహణకు అడ్డుతగిలాడు. ఈయనపై అప్పటి సీఐ రఘువీర్ విష్ణు ఆదేశాలతో ఎస్‌ఐ ఐ.గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. దర్యాప్తు నివేదికను కోర్టుకు సమర్పించాక, ముద్దాయి నేరం చేసినట్లు రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు సీఐ మల్లికార్జునరావు పేర్కొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank
ప్రాంతీయ కార్యాలయం, విశాఖపట్నం-I
డి. నెం.9-29-15/7, పద్మావతి టవర్స్, బాలాజీనగర్, సిరిపురం, విశాఖపట్నం-530003

సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

[illegible] 1) M/s. శ్రీ కృష్ణ ఆగ్రో ఫుడ్స్, [illegible] రూ.1,00,84,215.80/- [illegible] తేది.25.07.2025 [illegible] 09.10.2025 [illegible] రూ.1,00,84,215.80/- [illegible]

స్థిరాస్తి వివరములు:

ASSET ID:400078198944 : [illegible]

తేది : 09.10.2025
ప్రదేశం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సాక్షి క్లాసిఫైడ్స్

Education
- మీకు డిగ్రీ, డిప్లొమా, BTech, ఎంబీఏ లేకపోవడంవల్ల ఉద్యోగం లేనట్లయితే, మీ డిగ్రీని పూర్తిచేయడం కొరకు ఈరోజు మమ్మల్ని సంప్ర : 7997 96796 [SCA25009019]

Real Estate
- All Types Plots or Flats Buying and Selling, Contact Sneha Constructions, Vizag. Cell 93466 90116 [SCA25009009]
- గాజువాక కూర్మన్నపాలెం లో 900 గజాలు అమ్మకానికి లేదా డెవలప్‌మెంట్‌కు కలదు. డైరెక్ట్ పార్టీస్. ఫోన్ : 73864 14017 [SCA25008876]

PLOT FOR SALE
- 3 లక్షల 50 వేలుకి 116 గజాలు. GVMC స్టీల్ ప్లాంట్ కి దగ్గరలో 4 కి.మీ.లో 10 బిట్లు కొత్త లేఅవుట్ ప్రారంభంలో ఆఫర్‌గా ఇవ్వబడును. ఫోన్ : 80196 24319 [SCA25008880]

Services

GOLD LOANS
- లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి ఆదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14303]

OLD AGE HOME
- Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం॥ వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్ : 87904 49799, 90103 92178 [SCA25008969]

Wanted
- నెల్లూరు టౌన్‌లోని ప్రముఖ రెస్టారెంట్లో పని చేయుటకు 5 సంవత్సరాల అనుభవం కలిగిన సౌత్ ఇండియన్ మాస్టర్, టిఫిన్ మాస్టర్, సర్వర్స్, అసిస్టెంట్లు కావలెను. 9000921707. [NA-24449]
- ఆఫీస్ అసిస్టెంట్ (M), రిసెప్షనిస్ట్ (F), టెలీకాలర్స్ (F), కార్ డ్రైవర్ కం ఆఫీస్ అసిస్టెంట్, నో పార్కింగ్ బోర్డ్ పెట్టుటకు బాయ్స్ కావలెను. వ : 19-35 సం॥లు. ఫోన్ : 89787 26685 [V- 5311]
- హైదరాబాద్‌లో కేర్‌టేకర్స్ కావలెను. జీతం: 18-20 వేలు. సంవత్సరంలోపు 22-25 కి పెరిగే అవకాశం,వయస్సు 20-45లోపు ఉచిత భోజనం వసతి ESI PF కలదు. + 91 76809 22316 [G- 792]
- చెదల నివారణ సంస్థలో పని చేయుటకు సర్వీస్ బాయ్స్ కావలెను. వెహికల్ తప్పనిసరి, అర్హత : 10th, జీతం: రూ. 20,000/-, పెట్రోల్ చార్జ్ సపరేట్. ✆ 94945 69895 [B-950]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	:9010546644
యలమంచిలి	:9951602901
చోడవరం	:9010210265
నర్సీపట్నం	:9010234557
పాడేరు	:9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

ప్రైవేటు క్లినిక్‌పై పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు


మృతుడు కాశీ (ఫైల్)

రాంబిల్లి (అచ్యుతాపురం): వాడనర్సాపురంలో ఓ ప్రైవేటు క్లినిక్, మెడికల్ షాపుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామస్తులు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఎటువంటి విద్యార్హతలు లేని ఆర్‌ఎంపీ వైద్యురాలిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుమారు 4 వేల మంది వాడనర్సాపురం వాసులకు సరైన వైద్య సదుపాయాలు కల్పించాలని, నిబంధనలు అతిక్రమించి నడుపుతున్న మెడికల్ షాప్‌ని సీజ్ చేయాలని ఫిర్యాదులో కోరారు.

ప్రైవేటు వైద్యం వికటించి వ్యక్తి మృతి?

ప్రైవేట్ వైద్యం వికటించడంతో రాంబిల్లి మండలంలోని వాడనర్సాపురానికి చెందిన ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. అయితే దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినప్పటికీ పోస్టుమార్టం రిపోర్టు వచ్చే వరకూ వాస్తవాలు తెలిసే అవకాశం లేదు. వాడనర్సాపురానికి చెందిన ఎం.కాశీ(46) ఈ నెల 4వ తేదీన జ్వరం రావడంతో స్థానికంగా ఉన్న ఒక మెడికల్ షాపునకు వెళ్లి మాత్రలు అడిగారు. దీనికి అక్కడ ఉన్న క్లినిక్ నడుపుతున్న నర్సు రెండు తొడలపై ఇంజక్షన్లు చేసింది. అయితే జ్వరం తగ్గకపోగా, తొడలపై ఇంజక్షన్లు చేసిన చోట వాపు వచ్చింది. పరిస్థితి విషమించడంతో కాశీ కుటుంబీకులు బాధితుడ్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ నెల 6న కాశీ మృతి చెందడంతో కుటుంబీకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సరైన కారణం తెలియని మరణంగా కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నివేదిక కోసం వేచి చూస్తున్నారు. అవగాహన లేని వైద్యం వల్లే కాశీ మృతి చెందాడని అతని కుటుంబీకులు లబోదిబోమంటున్నారు. మృతుడు కాశీకి భార్య,ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భార్య కమలకు వినికిడి లోపం. దీంతో ఆ కుటుంబ పరిస్థితి వీధిన పడింది. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని, అవగాహన లేని వైద్యం అందిస్తూ రోగుల మృతికి కారణమవుతున్న ప్రైవేటు క్లినిక్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ కూడా వినిపిస్తున్నారు.

పల్లె వెలుగు బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం


సంజీవమెట్ట సమీపంలో పొలాల్లోకి దూసుకుపోయిన ఆర్టీసీ బస్సు

దేవరాపల్లి: దేవరాపల్లి-అనకాపల్లి రోడ్డులో సంజీవమెట్ట సమీపంలో సోమవారం పల్లె వెలుగు ఆర్టీసీ బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. దేవరాపల్లి నుంచి అనకాపల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు సంజీవమెట్ట దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పొల్లాల్లోకి దూసుకుపోయి మట్టిలో కూరుకుపోయింది. ఈ సమయంలో ఆర్టీసీ బస్సులో 15 మందికి పైగా ప్రయాణికులు ఉండగా డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో వారంతా సురక్షితంగా బయటపడ్డారు. వారందరినీ వేరొక బస్సులో ఎక్కించి పంపించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో స్థానికులు కొందరు మట్టి తవ్వి రోడ్డు పక్కన కుప్పగా వేయడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పించుకునే క్రమంలో ఈ మట్టి దిబ్బలతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న మట్టి దిబ్బలను తక్షణమే తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో వాడనర్సాపురం యువకుడి ప్రతిభ


మైలపల్లి శ్రీనివాస్

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని వాడనర్సాపురానికి చెందిన యువకుడు స్విమ్మింగ్ పోటీల్లో రాణిస్తూ బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. మంగళగిరిలో ఈ నెల 12న మాస్టర్స్ ఆక్వాటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు వాడనర్సాపురానికి చెందిన యువకుడు మైలపల్లి శ్రీనివాస్ 7వ మాస్టర్స్ ఆక్వాటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బ్రెంచ్ స్ట్రోక్‌లో బంగారు పతకం సాధించాడు. దీంతో వాడనర్సాపురానికి చెందిన వారంతా శ్రీనివాస్‌ను అభినందించారు.

కెనరా బ్యాంక్ Canara Bank
ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్ (13591), విశాఖపట్నం
సెంట్రల్ సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాబాగ్, విశాఖపట్నం-530020.
ఫోన్: 8332956773, 7095199455, ఇ-మెయిల్: cb13591@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

[illegible] తేది 29.10.2025 [illegible]

ఇ-వేలం తేది & సమయం: 29.10.2025, ఉ॥ 11.00 గం.ల నుండి మ॥ 12.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిముషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 28.10.2025, సాయంత్రం 4.00 గంటల లోపు

క్ర. సం	ఋణగ్రహీత / హామీదారులు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నంకు బదిలీ చేయబడినవి)	తనఖాలో ఉన్న ఆస్తి వివరములు	రిజర్వు ధర	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
1	M/s. [illegible] తేది 30.09.2025 [illegible]	సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 812/2017 తేది. 23.02.2017 [illegible]	రూ. 105.19 లక్షలు	రూ. 10.52 లక్షలు
2	M/s. [illegible] తేది 30.09.2025 [illegible]	సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 813/2017 తేది. 25.02.2017 [illegible]	రూ. 190.02 లక్షలు	రూ. 19.01 లక్షలు
3	[illegible] తేది 30.09.2025 నాటికి బకాయి మొత్తం: రూ. 1390.55 [illegible]	ఆస్తి నెం.1: [illegible]	రూ. 93.75 లక్షలు	రూ. 9.38 లక్షలు
		ఆస్తి నెం.2: [illegible]	రూ. 118.00 లక్షలు	రూ. 11.80 లక్షలు
		ఆస్తి నెం.3: [illegible]	రూ. 55.25 లక్షలు	రూ. 5.53 లక్షలు

ఆస్తి తనిఖీ తేది & సమయం: 22.10.2025, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥4.00 గం॥ల వరకు.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విశాఖపట్నం అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8332956773, 7095199455.

రిజర్వు ధరలో 10% సొమ్మును ధరావత్తుగా ఆర్.టి.జి.ఎస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా https://baanknet.com లోని E-వాలెట్‌కు బిడ్డర్ లాగిన్ అయి తేది: 28.10.2025, సా॥ 4:00 గం.ల లోపుగా చెల్లించవలెను.
* బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 10,000/- గుణింపులో పెంచవలెను. రిజర్వు ధర 25 లక్షల నుండి 100 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 25,000/- గుణింపులో పెంచవలెను మరియు రిజర్వు ధర 100 లక్షల కన్నా ఎక్కువ ఉన్నట్లయితే రూ. 50,000/- గుణింపులో పెంచవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్(baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com.
హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 09.10.2025, ప్రదేశం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కల్తీ మద్యంపై నిరసన గళం



కొత్తూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న మలసాల భరత్‌కుమార్, బొడ్డేడ ప్రసాద్, శోభా హైమావతి, మహిళా నాయకులు, తదితరులు

సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ర్యాలీ

అనకాపల్లి: రాష్ట్రంలో కల్తీ మద్యం గ్రామీణ స్థాయి నుంచి పెద్ద ఎత్తున ఏరులై పారుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ విమర్శించారు. కల్తీ మద్యం కేసులో చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి దాసరపల్లి జయంద్రరెడ్డిని అరెస్టు చేసినప్పటికీ అతనితో పాటు మిగిలిన వ్యక్తులపై సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. స్థానిక రింగ్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో నుంచి మండలంలో జాతీయ రహదారి మీదుగా కేఎస్‌ఆర్‌పేటలో జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయం వరకు పార్టీ నియోజకవర్గ మహిళా విభాగం ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి సీఐ వై.లక్ష్మణ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. నారా వారి.. కల్తీ మద్యం మాకొద్దు బాబోయ్...ప్రజల ఆరోగ్యంతో...చెలగాటాలు ఆడొద్దుబాబు...అంటూ పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు నినాదాలు


కొత్తూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో సీఐ లక్ష్మణనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న మలసాల భరత్‌కుమార్, బొడ్డేడ ప్రసాద్, శోభా హైమావతి, మహిళా నాయకులు

చేశాయి. అనంతరం భరత్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ కల్తీ మద్యం తాగిన వ్యక్తులు రాష్ట్ర వ్యాప్తంగా 500 మంది మృత్యువాత పడ్డారని, లక్షలాది మంది రాష్ట్రంలో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని వాపోయారు. రాష్ట్రంలో బెల్టుషాపులను నియంత్రించడంలో సీఎం చంద్రబాబునాయుడు విఫలమైనట్లు విమర్శించారు. కల్తీ మద్యం వ్యాపారంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గత టీడీపీ పాలనలో రెండు ప్రధాన సంఘటనలో తూతూమంత్రంగా సిట్ విచారణ చేశారన్నారు. సిట్ విచారణలో టీడీపీ నాయకులే ఉంటారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అవినీతిని వెలికి తీసే పత్రికలపై దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేయడం సిగ్గుచేటన్నారు. కల్తీ మద్యాన్ని ఎలా తయారు చేస్తున్నారు, దానికి ముడిసరుకును ఎలా తెచ్చుకుంటున్నారని ప్రశ్నించారు. బాటిళ్ల తరహాల్లోనే ఈ కల్తీ మద్యం బాటిళ్లను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కల్తీ మద్యం తయారు చేసి రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నాయకుల చేతులతోనే లిక్కర్ దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. దీనిపై కూటమి ప్రభుత్వానికి చెందిన రెండు ప్రధాన దినపత్రికలు రాయడం నిదర్శనమన్నారు.

ప్రతి గ్రామంలో 4 నుంచి 5 బెల్టుదుకాణాలు

పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ కల్తీ మద్యం విషయంలో సీఎం చంద్రబాబు నాయుడు పాత్ర కనిపిస్తుందన్నారు. ప్రతి గ్రామంలో 4 నుంచి 5 బెల్టుదుకాణాలు నడుస్తున్నాయన్నారు. బెల్టుదుకాణాలకు ఎలా పర్మిషన్ ఇచ్చారో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ జిల్లా అధికారులు చెప్పాలన్నారు. మద్యం బాటిళ్లను పూర్తిస్థాయిలో పరీక్షలకు ల్యాబ్‌కు పంపించాలన్నారు. గతంలో పరవాడలో ఇద్దరు వ్యక్తులు కల్తీ మద్యం తయారు చేసి విక్రయిస్తున్న సంఘటనలు ఉన్నాయన్నారు. కల్తీ మద్యంపై సీబీఐతో పూర్తిస్థాయి విచారణ చేయించాలన్నారు. పార్టీ పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి మాట్లాడుతూ విజయవాడ రాజధానిగా కల్తీ మద్యం వ్యాపారం సాగుతుందని విమర్శించారు. రాష్ట్రంలో సంపద సృష్టించడం అంటే ఇదేనేమో అని ఆరోపించారు. కల్తీ మద్యంతో బడుగు, బలహీన వర్గాల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వాపోయారు. కూటమి పాలనలో రానున్న రోజుల్లో కల్తీ మద్యాన్ని డోర్ టూ డోర్ సరఫరా చేసినా ఆశ్చర్యపోనవసరం లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏవీ రత్నకుమారి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పద్మకుమారి, జిల్లా మహిళా నాయకురాలు మరిపల్లి శోభ, నీటిపల్లి లక్ష్మి, కాండ్రేగుల హైమావతి, లక్ష్మి, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన


సైబర్ నేరాలపై అవగాహన కలిగిస్తున్న సీఐ అల్లు స్వామినాయుడు

కశింకోట: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ అల్లు స్వామినాయుడు హెచ్చరించారు. మండలంలోని పరవాడపాలెం గ్రామంలో గౌరమ్మ ఉత్సవం పురస్కరించుకొని సోమవారం రాత్రి సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టుల మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటీటీ మోసాలు, సైబర్ సెక్యూరిటీల గురించి వివరించారు.

కెనరా బ్యాంకు శాఖ ప్రారంభం


కెనరా బ్యాంకు శాఖ ప్రారంభిస్తున్న జనరల్ మేనేజర్ విజయలక్ష్మి

కశింకోట: స్థానిక పోస్టాఫీసు వీధిలో నూతనంగా కెనరా బ్యాంకు శాఖ సేవలను ప్రారంభించింది. బ్యాంకు విజయవాడ పరిధి జనరల్ మేనేజర్ విజయలక్ష్మి దీన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, గృహ రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, బ్యాంకు ఏజీఎం మధుసూదన్ రెడ్డి, కశింకోట శాఖ మేనేజర్ మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల పట్ల లింగ వివక్ష చూపొద్దు


తాళ్లపాలెం బాలికల గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మెర్సీ

కశింకోట: బాలికల పట్ల లింగ వివక్ష చూపరాదని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జె. మెర్సీ తెలిపారు. మండలంలోని తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ. మోహన్ కిషోర్ ఆధ్వర్యంలో తాళ్లపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బాలల రక్షణ, లింగ వివక్ష రూపు మాపడానికి తీసుకోవలసిన చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల బాలికలను సమదృష్టితో తల్లిదండ్రులు, సమాజం చూడాలన్నారు. లింగ వివక్ష కూడదన్నారు. 18 ఏళ్ల వయస్సు నిండే వరకు బాలికలకు వివాహం చేయరాదన్నారు. ఆరోగ్య బోధకుడు ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ, పీహెచ్ ఎన్ ఎస్. చిలుకవేణి, ఏఎన్‌ఎం బీఎస్ సునీత, అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 401 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	5,500	5,500
మొదటి రకం	4,310	5,300
రెండో రకం	3,930	4,440
మూడో రకం	3,800	4,050

అనకాపల్లి సినిమాలు

రాజా	ఇడ్లీ కొట్టు(ఉదయం, మధ్యాహ్నం)
రాజా	శశివదనే(ఫస్ట్, సెకండ్ షో)
సత్యనారాయణ స్క్రీన్-1	కాంతార
సత్యనారాయణ స్క్రీన్-2	టీఆర్‌ఓఎన్ ఏఆర్ ఈఎస్(తెలుగులో)
పర్తిసాయి	ఓజీ
షిర్డీసాయి	అరి
వెంకటేశ్వర	కానిస్టేబుల్
రామచంద్ర	మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 73 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-16, బీ పాజిటివ్-25, ఓ పాజిటివ్-26, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 413 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

కాంట్రాక్టు వర్కర్ల సమస్యల్ని పరిష్కరించాలి

అనకాపల్లి టౌన్: జిల్లా వ్యాప్తంగా ఏరియా కమ్యూనిటీ హెల్త్, అర్బన్ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న మెడికల్ కాంట్రాక్టు వర్కర్ల సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోనా లక్షణ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి డీసీహెచ్ డాక్టర్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ కృష్ణారావులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. వీరికి 50 సంవత్సరాల వరకే వయోపరిమితి పెట్టారని, ఈ రంగంలో కార్మికులు 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారని, వీరిని 50 సంవత్సరాల పేరుతో తొలగించడం దుర్మార్గమని తెలిపారు. కార్యక్రమంలో వద్దాది అప్పలరాజు, కాశీ, చిందాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ ఆస్పత్రి డీసీహెచ్‌ఎస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెండు ఆటోలపై కేసులు

అనకాపల్లి టౌన్: అధిక సంఖ్యలో విద్యార్థులను ఎక్కించుకొని ప్రయాణిస్తున్న రెండు ఆటోలపై కేసులు నమోదు చేసినట్లు పట్టణ ట్రాఫిక్ సీఐ ఎం వెంకటనారాయణ తెలిపారు. సోమవారం సాయంత్రం మండలంలోని శారదానగర్‌లో వివిధ స్కూళ్లకు చెందిన విద్యార్థులను పరిమితికి మించి ఆటోల్లో తీసుకువెళ్తుండగా తనిఖీలు చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చెరువుల్లో గంబూషియా చేపల పెంపకం


చెరువులో గంబూషియా చేప పిల్లలు వేస్తున్న జిల్లా మలేరియా అధికారి సత్యప్రసాద్

కశింకోట : మండలంలోని పలు మంచినీటి చెరువుల్లో దోమల నివారణకు 'గంబూషియా' చేపల పెంపకాన్ని సోమవారం ప్రారంభించారు. జిల్లా మలేరియా అధికారి సిహెచ్. సత్యప్రసాద్ ఈ సందర్భంగా చేప పిల్లలను చెరువులో విడిచిపెట్టారు. బయ్యవరం, తాళ్లపాలెం, నరసింగబిల్లి వద్ద చెరువుల్లో వీటిని పెంపకానికి వేశారు. మలేరియా, చికెన్ గునియా వంటి వ్యాధులకు కారణమయ్యే దోమల లార్వాలు మంచినీటిలో వృద్ధి చెందుతాయని, వాటిని ఈ చేపలు తిని వ్యాధుల నివారణకు దోహదపడతాయని ఈ సందర్భంగా సత్యప్రసాద్ తెలిపారు. గ్రామ నాయకుడు షేక్ రెహమాన్, ఆరోగ్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

అనకాపల్లి టౌన్: బాలికలు శారీరకంగా, మానసికంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం హైమావతి ఆకాంక్షించారు. పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలపై లింగ వివక్ష చూపరాదన్నారు. సేవ్ గర్ల్ చైల్డ్ భావనతో ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని సూచించారు. బాలికల బాలుర నిష్పత్తి సమానంగా ఉండేలా చూడాలని తెలిపారు. బాలికలకు తమ హక్కుల పట్ల అవగాహన కల్పించడానికి లింగ వివక్ష రూపు మాపడానికి, మహిళా సాధికారత కోసం పోరాటం అనేది బాలికా దినోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. నేనే అమ్మాయిని, నేనే నడిపించే మార్పును, ఆడపిల్లలను పుట్టనిద్దాం, బతకనిద్దాం, ఎదగనిద్దాం అనే నినాదంతో ప్రజలతో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అండ్ టీబీ అధికారి డాక్టర్ స్వప్న, డీఐవో డాక్టర్ చంద్రశేఖర్, హెచ్‌ఎం రుధిర రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హైమావతి

కశింకోటలో వర్షం


కశింకోటలో కురుస్తున్న వర్షం

కశింకోట: మండల కేంద్రంలో సోమవారం వర్షం కురిసింది. వీధులు బురదమయంగా మారాయి. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది చెందారు. ఆకాశం మేఘావృతమై అకస్మాత్తుగా కురిసిన వర్షం వల్ల స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్‌లో నిర్మిస్తున్న రోడ్డుపై నీరు చేరింది. భవానీ కాలనీ, స్టేషన్ రోడ్, పీహెచ్‌సీ రోడ్ నీటిమయంగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.


ఆర్టీసీ బస్ స్టేషన్ నిర్మాణ రోడ్డుపై చేరిన వర్షంనీరు

నల్ల బ్యాడ్జీలతో వైద్యుల నిరసన

కశింకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్యులు నిర్వహిస్తున్న సమ్మెకు సోమవారం సంఘీభావం ప్రకటించారు. పీహెచ్‌సీ వైద్యుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కోశాధికారి సిహెచ్. సత్యనారాయణ మాట్లాడుతూ పీహెచ్‌సీ వైద్యులకు గతంలో వలె 23 శాతం ఇన్ సర్వీసు కోటా కల్పించాలన్నారు. ప్రమోషన్ పాలసీ వేగవంతం చేయాలన్నారు. వైద్యుల కోర్కెలు పరిష్కరించి సమ్మె సత్వరమే పరిష్కారం కావడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమ్మెకు యూనియన్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్టు యూవీఎస్‌ఎన్ ఫణి భూషన్, టి. మురళీకృష్ణ, కె. శివాజీ, ఆర్. విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.


సంఘీభావంగా నిరసన తెలుపుతున్న కశింకోట పీహెచ్‌సీ సిబ్బంది

భూమి చదును పనులు అడ్డుకున్న నిర్వాసితులు

మాకవరపాలెం: ఏపీఐఐసీ భూముల్లో చదును పనులను ఆన్‌రాక్ నిర్వాసితులు అడ్డుకున్నారు. రాచపల్లి వద్ద నిర్మించిన ఆన్‌రాక్(పయినీర్) అల్యూమినియం రిఫైనరీ కోసం 2008లో 2200 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. ఆ సమయంలో హామీ ఇచ్చిన ఇంటికి ఒక ఉద్యోగం, పాడి గేదెలు, రెండు సెంట్ల స్థలం ఇప్పటికీ అందించలేదు. మరికొందరికి ఇళ్లస్థలాలు, అదనపు ప్యాకేజీ రూ.50 వేల పరిహారం అందలేదు. ఈ నేపథ్యంలో సోమవారం రామన్నపాలెం, చినరాచపల్లి, వెంకయ్యపాలెం గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులు పనులను భూమి చదును పనులను అడ్డుకున్నారు.

పెట్రోల్ బంకుల్లో నిబంధనలు పాటించాలి

దేవరాపల్లి : పెట్రోల్ బంకుల్లో కచ్చితంగా నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని స్థానిక తహసీల్దార్ పి.లక్ష్మీదేవి హెచ్చరించారు. దేవరాపల్లిలోని పెట్రోల్ బంక్‌ను సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ రవితో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెట్రోల్ బంక్‌లో రికార్డులను, మరుగుదొడ్లు, తాగునీటి వసతి తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పెట్రోల్ బంకుల్లో స్టాక్ రిజిస్టర్లు, అమ్మకం, కనుగోలు వివరాల రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని సూచించారు.

దారులు దారుణం

- ఏ గ్రామం చూసినా గతుకుల రోడ్లే
- గోతుల్లో పడి గాయాల పాలవుతున్న ప్రయాణికులు
- రోడ్లు వేస్తున్నామని ప్రకటనలే
- క్షేత్రస్థాయిలో కనిపించని అభివృద్ధి


తుమ్మపాల జంక్షన్‌లో ఏర్పడిన భారీ గొయ్యి

అనకాపల్లి టౌన్: అధికారంలోకి వచ్చిన వెంటనే గతుకులు లేని రోడ్లు నిర్మిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి పాలకులు రెండేళ్లు సమీపిస్తున్నా అలసత్వం వహిస్తున్నారు. సంక్రాంతి అన్నారు.. దసరా వెళ్లిపోయింది.. మరలా సంక్రాంతి వచ్చేస్తుంది. అయినా రోడ్లు వేయడం దేవుడెరుగు కనీసం గుంతలు కూడా పూడ్చడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ గుంతల రోడ్లు దర్శనమిస్తున్నాయి. అత్యంత ప్రాధాన్యత ఉన్న గ్రామాలకు వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మేజర్ పంచాయతీ తుమ్మపాల జంక్షన్ మొత్తం గోతులతో నిండి ఉంది. తుమ్మపాల వాసులు, అటుగా వెళ్లేవారు, వచ్చేవారు యధావిధిగా ఇంటికి వస్తామన్న గ్యారంటీ లేదు. ఎందుకంటే గజానికొక గొయ్యి. ఆ గొయ్యిలోకి ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరింది. దాంతో అక్కడ గొయ్యి ఉందని తెలియక పోవడంతో ద్విచక్ర వాహనదారులు అందులో పడి గాయాల పాలవుతున్నారు. ఈ రహదారి గుండానే చోడవరం, మాడుగుల, పాడేరు గ్రామాలకు నిత్యం ఆర్టీసీ బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు నిత్యం ప్రయాణిస్తుంటారు. వీరందరూ తీవ్ర ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు.

ప్రమాదకరంగా రోడ్లు...

- మార్టూరు జంక్షన్ నుంచి మాకవరం వెళ్లే రహదారి దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర అస్తవ్యస్తంగా తయారైంది. ప్రధానంగా పాపయ్య సంతపాలెం, మాకవరం, కొండుపాలెం, సీహెచ్‌ఎన్ అగ్రహారం గ్రామాల ప్రజలు ఈ రహదారి నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, రోజువారీ కార్మికులు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి.
- మామిడిపాలెం జంక్షన్, ఊడేరు పెట్రోలు బంక్ ఎదురుగా భారీ గోతులు ఏర్పడ్డాయి. చినబాబు కాలనీ నుంచి బొజ్జన్న కొండకు వెళ్లే జంక్షన్ గొయ్యిలతో నిండి ఉంది.
- బవులవాడ గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా ఛిద్రమైంది. రోడ్డు బీటలు వారడంతో ద్విచక్ర వాహనం టైరు జారిపోతోంది. దీంతో పలువురు కింద పడి గాయాల పాలవుతున్నారు.
- తుమ్మపాల గ్రామం నుంచి దిబ్బపాలెం వెళ్లే ప్రధాన మార్గం గొయ్యిలతో నిండి పోయింది. వర్షం పడితే అందులో నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తోంది. కొత్తగా ప్రయాణించే ప్రయాణికులు గోతులను అంచనా వేయలేక రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి నేతలు రోడ్ల నిర్మాణానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులకు పొంతన ఉండడంలేదు. ఇకనైనా తక్షణమే గ్రామాల్లో రోడ్లు నిర్మించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


బొజ్జన్న కొండకు వెళ్లే మార్గంలో ఏర్పడిన గోతులు


దిబ్బపాలెం గ్రామం ప్రధాన రోడ్డుకు బీటలు


ఊడేరు పెట్రోలు బంకు వద్ద రోడ్డు దుస్థితి


తుమ్మపాల నుంచి దిబ్బపాలెం వెళ్లే చెరువులా మారిన ప్రధాన మార్గం


మార్టూరు జంక్షన్ ముందు రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి

గతుకుల రోడ్లతో భయంగా..



గతుకుల రోడ్లపై ప్రయాణించాలంటే భయమేస్తోంది. రెండు సంవత్సరాలు కావస్తున్నా, రోడ్లు వేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. తక్షణమే గుంతలు పూడ్చి రోడ్లు వేయాలి.

– బుద్ధ లహరి, తుమ్మపాల

గోతుల్లో పడి గాయాలు



ఏ గ్రామానికి వెళ్లినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయి. ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు రాత్రిళ్లు గొయ్యి ఎక్కడ ఉందో తెలియక గోతుల్లో పడి గాయాల పాలవుతున్నాం.

– ఎం.జె. నాయుడు, అనకాపల్లి

మద్యం తరలిస్తున్న మహిళ అరెస్టు

కశింకోట: మండలంలోని పరవాడపాలెం గ్రామంలో మద్యం అక్రమంగా తరలిస్తున్న మహిళను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ సూర్యారావు సోమవారం తెలిపారు. సీఐ అల్లు స్వామినాయుడు ఆదేశాల మేరకు పరవాడపాలెం గ్రామానికి చెందిన బొండా మంగ పది మద్యం సీసాలను తరలిస్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

దేవరాపల్లి : సామాన్యుడి వజ్రాయుధమైన సమాచార హక్కు చట్టంపై ప్రజలకు, అధికారులకు ప్రభుత్వం అవగాహన కల్పించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ డిమాండ్ చేశారు. ఈనెల 12నాటికి ఈ చట్టం అమలులోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయినప్పటికీ ప్రజలు, అధికారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించకపోవడం దారుణమన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

అనకాపల్లి :

9010973030, 9010546644, 9951602901

Office mail : sakshiadvtvsp@gmail.com